# సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వమే అధికారంగా నిర్వహించాలి



వివరాలు మొయిన్‌లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 04 సెప్టెంబరు, 2024 | పేజీలు : 04

# సాగర్ ప్రాజెక్టుకు క్రమంగా తగ్గుముఖం పడుతున్న వరద

**ప్రజాపక్షం/నందికొండః** గత ఐదు రోజులుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 5 లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ భారీ వరద ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంటే మంగళవారానికి ఈ వరద ప్రవాహం ఒకేసారి తగ్గుముఖం పట్టి సాయంత్రం 6 గంటలకు 276447 క్యూసెక్కుల వర ద ప్రవాహం కొనసాగుతుంది . అయితే రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తూ నీటి నిల్వ సామర్థం పూర్తిస్థాయికి చేరుకోవటంతో మంగళవారం కూడా ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీటి విధులను కొనసాగిస్తున్నారు. గతంలో కంటే గేట్ల ఎత్తును తగ్గించి 12 గేట్లను 10 అడుగులు, 14 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 277702 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 29435క్యూసెక్కులు కుడి కాలువ ద్వారా 6979 క్యూసెక్కులు ఎస్ ఎల్ వి సి ఏ ఎం ఆర్ పి ద్వారా1800క్యూసెక్కులు లో లెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా600 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. అయితే ఎడమ కాలువ ద్వారా ఎటువంటి నీటి విడుదల కొనసాగడం లేదు.ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా 276447 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంటే ఇన్ ఫ్లో కంటే ఎక్కువ మొత్తంలో 316516 క్యూసెక్కుల నీటినిఅవుట్ ఫ్లో గా దిగువకు విడుద చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ గరిష్టనీటి మట్టం 590 అడుగులకు గాను 585.90అడుగులుగా, నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసీలకు, 300.3015 టీఎంసీలుగా ఉన్నది.



# మూసీపై బ్రిడ్జి నిర్మించండి

## ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మండలంలోని సూరెపల్లి, పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం, ఇంద్రియాల శివారులో మూసీ నది వద్ద నూతనంగా హై లేవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రెండు మండలాల్లోని ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని భువనగిరి మండలంలోని సూరెపల్లి, ఆకుతోటబావితండా, కాంగ్లకుంటతండా, పచ్చర్లబోడుతండా గ్రామ ప్రజలు, రైతులు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూదాన్ పోచంపల్లి మండలాల్లోని ఇంద్రియాల చుట్టు పక్కల గ్రామాల్లో భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండా, సూరెపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతుల భూములు ఉన్నందున అట్టి గ్రామానికి వెళ్లాలంటే బీబినగర్ మండలంలోని భట్టుగూడెం, పెద్దరావులపల్లి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుందని, అంతేకాకుండా సూరెపల్లి, బొల్లెపల్లి, ఆకుతోటబావితండా, కాండ్లకుంటతండా, పచ్చర్ల బోడుతండా, ప్రజలు నిత్యం భూదాన్ పోచంపల్లి, హయత్ నగర్, పెద్ద అంబర్ పేట్, ఏల్బినగర్, తదితర ప్రాంతాల్లో విద్యార్థులు చదువుల కోసం ప్రయాణం చేయాలంటే ఇక్కడి నుంచి 25 కిలోమీటర్లు మాత్రమే ఉండగా చుట్టు ఇటు బీబీనగర్, భట్టుగూడెం అటు చౌటుప్పల్ మీదుగా 60 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని ఇక్కడి గిరిజన ప్రజలను దృష్టిలో పెట్టుకొని వెంటనే మూసీనది పై నూతన బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి సంబంధించిన డీఈతో ఫోన్లో మాట్లాడి వెంటనే అక్కడి ఎస్టిమేషన్ తీసుకొని వివరాలతో సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చెవ్వల నరేష్, బానోతు నరసింహ, కెతావత్ ఉమ్లా నాయక్, ఉప సర్పంచ్ గుగులోతు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు పిట్టల రజిత, గ్రామస్థులు, మద్ది వెంకటనర్సిహ్మారెడ్డి, గుగులోతు లచ్చిరాం నాయక్, గుగులోతు నర్సింహ్మా నాయక్, లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, అనంతరెడ్డి, చెవ్వల హరికృష్ణ, చముదాల రామకృష్ణ, మద్ది యుగంధర్ రెడ్డి , గులాం రసూల్, సూర్యప్రకాష్, మధుగాని మైసయ్య, మధుగాని వెంకటేష్, ఆడెపు మహేందర్, భానోత్ శంకర్, జీడిమట్ల కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం

## రైతాంగానికి అండగా ఉంటుంది

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి):** భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి కేంద్రంతో పాటు మండలంలోని చౌటపల్లి, రఘునాథపాలెం,గుండ్లపల్లి,చెన్నాయిపాలెం గ్రామాలలో మంత్రి ఉత్తమ్ సుడిగాలి పర్యటన చేశారు.అకాల వర్షాలతో దెబ్బ తిన్న చెరువులు,కాల్వలు,పంట పొలాలను ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ చెరువులు,కాలువల మీద కాలినడకన కలియ తిరుగుతూ రైతాంగాన్ని ఓదారుస్తూ, ప్రతి రైతుకు భరోసా నిచ్చారు.ప్రయాణానికి అనువుగాని ప్రాంతాలకు ట్రాక్టర్ మీద పయనించి వరద ముంపు ప్రాంతాలను, పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు.నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదు అయిందన్నారు.వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాలకు ఎకరాలకు రూ.10వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామని వెల్లడించారు.వర్షపు ఉధృతికి పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు రూ.10వేలు,పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లకు ఇందిరమ్మ పథకంలో భాగంగా పక్కా గృహాలు నిర్మిస్తామని తెలియజేశారు.మృతి చెందిన పశువులకు రూ.50వేలు,దురదృష్టవశాత్తు మరణించిన కుటుంబాలకు రూ.5లక్షలు అందిస్తామన్నారు.ప్రకృతి సృష్టించిన భీభత్సమన్నారు.నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏఒక్కరు మనోధైర్యం కోల్పోరాదని మంత్రి ఉత్తమ్ ప్రజలకు ఉద్బోధించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# తండాను పట్టించుకోవాలని గిరిజనుల డిమాండ్



ప్రజాపక్షం/తుర్కపల్లి: మండలకేంద్రం నుండి ములక లపల్లి, గొల్లగూడెం వెళ్లే రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బ తిన్నదని, దేవోజి నాయక్ తండ వాసులకు రోడ్డు మార్గాలు సరిగా లేకపోవడం వల్ల తండావాసులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని తమ సమస్యలు పట్టించుకోవలని తాండవాసులు అధికారులను డిమాండ్ చేశారు. నిత్య అవసరాల కోసం, ఆరోగ్య సమస్యలకై హాస్పిటల్ కి వెళ్ళడానికి కూడా రోడ్డు సౌకర్యాలు సరిగా లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనికి ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరిలో జిల్లా యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దీరావత్ రమేష్ నాయక్,జై సేవాలాల్ యూత్ అధ్యక్షుడు దిరవత్ రమేష్ నాయక్, బాలు నాయక్, వినోద్ నాయక్, నరేం దర్ నాయక్,హస్సేన్ నాయక్, హనుమంతు,రాంజీ నాయక్ తదితరులు ఉన్నారు.

# సామర్థ్యాల మెరుగుదులకు కాంప్లెక్స్ సమావేశాలు



ప్రజాపక్షం/నేరేడుచర్ల: ప్రాథమిక స్థాయిలో విద్యా ర్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు కాంప్లెక్స్ సమావేశాలు దోహద పడతాయని ఎంఈవో చత్రునా యక్ అన్నారు.మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రాథమిక పాఠశాలల సము దాయాల సమావేశాలు కాంప్లెక్స్ హెచ్ఎంలు బట్టు మధు, ఎల్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమా వేశంలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు.విద్యార్థులకు సరళ రీతిలో బోధించుటకు, తమ నైపుణ్యాలు మెరుగు పర్చుకొనుటకు సమావేశాలను ఉపాధ్యాయిని,ఉపా ధ్యాయులు మెరుగుపర్చుకోవాలని సూచించారు.ఎంఎ న్ఓ పి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 19న 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే నేష నల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కోరారు. కాంప్లెక్స్ సమావేశాల్లో ఆర్పీలు శ్రీనయ్య, శ్రీధర్, సత్య నారాయణరెడ్డి శిక్షణ అందించారు. కార్యక్రమంలో సిఆర్పీలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయిని,ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

# సుభాష్‌నగర్‌లో రాష్ట్రీయ పోషణమాసం



ప్రజాపక్షం/మిర్యాలగూడ: రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో మమత పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడి కేంద్రంలోని ప్రీ స్కూల్ కథల పుస్తకాల్లోని ఆసక్తికర మైన చిత్రాలను చూపిస్తూ చిన్నారులకు అర్థమయ్యేలా కథలను వివరించడం జరిగిందన్నారు. ఆసక్తికరమైన బొమ్మలు ఉన్న కథల పుస్తకాలను, చిన్నారులకు ఇచ్చి బొమ్మలను చూడమనడం జరిగిందన్నారు. అదేవి ధంగా తల్లులు పోషకాహారాన్ని తీసుకుంటూ ఆరో గ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీమాబేగం, అంగన్‌వాడి టీచర్లు చిన్నమ్మ,లత, ఏఎ న్ఎం భాగ్యమ్మ, ఆశా అనిత తదితరులు పాల్గొన్నారు.

# మా డిగ్రీ కళాశాల మకే కావాలి



ప్రజాపక్షం/భువనగిరి: మా డిగ్రీ కళాశాల మకే కావాలని బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ డిగ్రీ పురుషుల గురుకుల కళాశాలను జిల్లా నుండి తరలించకుండా ఆపాలని బిజెవైఎం ఆధ్వ ర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయ అధికారి జగన్మోహన్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెవైఎం జిల్లా అధ్య క్షులు పట్నం కపిల్ మాట్లాడుతూ యాదాద్రి భువన గిరి జిల్లాకు చెందిన మహాత్మ జ్యోతిబా పూలే తెలం గాణ బిసి సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలను కందు కూర్ మండలం, మహేశ్వరం నియోజకవర్గం రంగా రెడ్డి జిల్లాకు తరలించడాని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కాలం నుండి జిల్లా నుండి ప్రభుత్వ విద్యాసంస్థలను తల రించే ప్రయత్నం కొనసాగుతూనే ఉందని తెలిపారు. భువనగిరి నుండి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తరలి స్తుంటే ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి ఏం చేశారని అన్నారు. బీజేవైఎం ఉద్యమాలు చేసి ఆ రెండు విద్యా సంస్థలను రక్షించుకుందని, ఈ మహాత్మ జ్యోతిబా పూలే ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను రక్షిం చుకుంటాం అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇకనైనా నిద్ర మత్తును వీడాలని నియో జకవర్గంలో విద్యారంగం ఎలా భ్రష్టు పడుతుందో చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బూరుగు మణికంఠ, మంగు నరసింహ రావు, బట్టు క్రాంతి, బొజ్జ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయిం చాలని నాయి బ్రాహ్మణుల సంఘం మండల అధ్య క్షులు బొల్లెపల్లి శ్రీహరి ప్రభుత్వాన్ని కోరారు. మంగ ళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో మాట్లాడుతూ కరోనా వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వృత్తి నడవక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని అన్నారు. వృత్తిలోనికి కార్పొరేట్ సెలూన్లు రాకుండా చూడాలని, నాయి బ్రాహ్మణ అభివృద్ధికి రుణాలు ఇవ్వాలని ఉచిత విద్యుత్తు బకా యిలను వెంటనే చెల్లించాలన్నారు. కళ్యాణ కట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం పరిమి నెంట్ చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఆర్టీసీ బస్టాండ్‌లో కాంప్లెక్స్‌లో బార్బర్ షాపు ఏర్పాటు చేసు కునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం, మండల ప్రధాన కార్య దర్శి బండి నరేష్, కోశాధికారి రాచమల్ల కృష్ణ, టౌన్ అధ్యక్షుడు రాచమల్ల బలరాం, రాచమల్ల మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

# యుడైస్‌పై శిక్షణా కార్యక్రమం



ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం,): ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ఉన్నత, ప్రయివేటు పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు యు డైస్ పై ఒక రోజు శిక్షణ కార్య క్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మ కూర్ నందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దే శించి కురెళ్ళ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యం.దామోదర్ మాట్లాడుతూ యు డైస్ 2024 25కు సంబంధించి అందరు ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల, ఉపాధ్యా యుల నమోదు, పాఠశాలకు సంబంధించిన భౌతిక వసతులకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు జరగ కుండా ఆన్లైన్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యా యులను కోరారు. ఆన్లైన్‌కు సంబంధించి ప్రధానోపా ధ్యాయులకు రిసోర్స్ పర్సన్ సిహెచ్ చిత్తరంజన్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు యం.రత్నమాల, యం.శ్రీధర్ రావు, యం.పద్మ, కే.రమేష్, ఎల్‌డిఏ యం.వెంకటేశ్వర్లు, సీఆర్పీలు కే.సత్తయ్య, టి.నర్సయ్య పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు పాల్గొన్నారు.

# 4వేల మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

ప్రజాపక్షం/మిర్యాలగూడ: పర్యావరణ పరిరక్ష ణకు గాను మున్సిపాలిటి పరిధిలో వినాయక చవితి సందర్భంగా 4వేల మట్టి గణపతి విగ్రహాలు ప్రజ లకు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ మంగళవారం తెలిపారు. ఈనెల 7న వినాయక చవితి సందర్భంగా ప్రజలు పాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను ఉత్సవాల్లో పెట్ట కుండా మట్టి గణపతి విగ్రహాలను గత సంవత్సరం మున్సిపాలిటి ప్రజలకు పంపిణీ చేసిందని, ఈ ఏడాది కూడా పంపిణీ చేయాలని నిర్ణయించామ న్నారు. మండపాల నిర్వాహకులు తమ మండపం ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని అన్నారు. దాని వల్ల పనులు సులభతరం అవుతా యని అన్నారు. ఆయన వెంట పర్యావరణ ఇంజనీర్ శ్వేత ఉన్నారు.

# రుణమాఫీలో రేషన్ కార్డు లేని కుటుంబ నిర్ధారణను పరిశీలించిన ఏడీఏ



ప్రజాపక్షం/తుర్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండులక్షల రుణమాఫీ లిస్టులో రేషన్ కార్డులేని రైతులకు ఋణ మాఫీ చేయడానికి రైతు కుటుంబాలను నిర్ధారించడానికి యాదాద్రిజిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని యాదగిరి గుట్ట ఏడీఏ శాంతి నిర్మల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకొని రైతులు రైతువే దికలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుటుంబ సభ్యుల నిర్ధారణను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణీ ఉమా, ఏఈఓలు పృథ్వీరాజ్, ఉమారాణి, దివ్య, జెస్సి, తిరుమల్ రావు, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సిఎం సహాయ నిధి



ప్రజాపక్షం/రామన్నపేట: పేదలకు వరం సీఎం సహాయ నిధి అని వెల్లంకి మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన నకిరేకంటి మహేష్, గుర్రం నరేష్, నన్నూరి భిక్షంరెడ్డి, ఎస్.మహేష్‌లు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందగా వారికి ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్నా నరసింహ, మాజీ డీసీసీ కార్యదర్శి తాటిపాముల శేఖర్‌గౌడ్, నాయకులు అయిటిపాముల పెద్దులు, సాగర్ల సైదులు తదితరులు ఉన్నారు.



ప్రజాపక్షం/మునుగోడు : మునుగోడు మండలం లోని ఎలగల గూడెం గ్రామానికి చెందిన ఈదుల కంటి సరిత కూతురు ఇటీ వల అనారోగ్యానికి గురి కాగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళ వారం సరిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్ర మంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటే శ్వర్లు,మాజీ సర్పంచ్ సురిగి చలపతి,మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్, శాఖ కార్యదర్శి తీర్పారి కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి,తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/మిర్యాలగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వర మని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులు అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 72 మంది బాధితులకు మంజూరైన రూ.18,96,500 విలువగల చెక్కులను వారు అందచేసి మాట్లాడారు. సీఎం సహాయ నిధి ఆపద సమయంలో పేదలను ఆదుకుంటుందన్నారు. కార్యక్ర మంలో మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎం ఎస్ వైస్ ఛైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చిట్టి బాబునాయక్, వీరకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చెక్ లను రిలీజ్ చేసి పేద ప్రజలకు సహాయం చేశారన్నారని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్య లతో పలు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 23 మంది నిరు పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.8,56,500 విలువ గల చెక్ లను ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిది అన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతుందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చెక్ లను రిలీజ్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు సహాయం చేశా న్నారు. ఈ పథకాన్ని నిర్విరామంగా కొనసాగిస్తూ పేద ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రజిత వెంకట్ రెడ్డి, పాదురి ఇంద్రసేనా రెడ్డి,నాగులవంచ వెంకటే శ్వర రావు, సైదులు గౌడ్,సత్య నారాయణ, బొంత శ్రీను, యాద గిరి,తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది





**ప్రజాపక్షం/డిండిఫ:** మండల పరిధిలోని గోనబోయిన పల్లి గ్రామానికి చెందిన పలువురు చేపలు పట్టడానికి వెళ్లి సిద్దాపురం శివారులోని రాతి బండపై 10 మంది చిన్నపిల్లలతో ఉంటున్న చెంచులు వరద మధ్యలో చిక్కుకున్న విషయం తెలుసుకొని వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాగులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు స్వయంగా రంగంలోకి దిగి, గజ ఈతగాళ్ల సహాయంతో వాగులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో సిద్దాపురం సమీపంలోని డిండి వాగు వద్దకు చేరుకొని వదర బాధితులను నేరుగా కలిసి ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చంపేట ఎంఎల్ఏ వంశీకృష్ణతో కలిసి బాదితులకు భరోసా కల్పించిన దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్. భారీ వర్షాలు వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ. 4లక్షల నుండి 5లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10వేల చొప్పున నష్టపరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని అన్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణి, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, భారీ వర్షాలు, వరదల వలన వాటిల్లిన నష్టాలపై అన్ని విభాగాల నుండి ప్రాథమిక నివేదకలు తెప్పించి, బాధితులను ఆదుకోవాలని అన్నారు. గత మూడు రోజులుగా భారీ వర్షాలతో అతలాకుతలమైన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించోద్దని అధికారులను ఆదేశించారు. పేదలను ఆదుకోవడంలో ఎక్కడ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ శైలేష్, డిఎస్పి గిరిబాబు, ఎంఆర్‌వో ఆంజనేయులు, ఎంపిడివో డానియల్, సిఐ సురేష్, ఎస్ఐ రాజు, రెవెన్యూ శాఖ యాంత్రాంగం, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ ప్రక్షాళనకు నిర్వహించే సదస్సును జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** గోదావరి, కృష్ణ జలాల సాధన కోసం, మూసీ ప్రక్షాళనకై నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన, గోదావరి, కృష్ణ జలాల సాధన వేదిక జిల్లా కో కన్వీనర్ కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో మూసీ ప్రక్షాళన గోదావరి కృష్ణ జలాల సాధన వేదిక ఆధ్వర్యంలో సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా నాయకులు దయ్యాల నర్సింహ, మాజీ సర్పంచ్ బొల్లేపల్లి కుమార్, పాల సంఘం మాజీ చైర్మన్ ఎదునూరి మల్లేశం, నీటి సంఘం మాజీ చైర్మన్ గునుగుంట్ల శ్రీనివాస్, వేదిక మండల నాయకులు, రైతులు అబ్దుల్లాపురం వెంకటేష్, ఎండి. జహంగీర్ తదితరులు పాల్గొన్నారు

## రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్‌:** రాష్ట్రంలో సమగ్ర కుల గనణ చేపట్టి బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కులగణన లేకుండా,బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బిసిలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి బడుగు బలహీన వర్గాల ప్రజలు ఓటు అనే ఆయుధంతో సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీఫ్ షాపులను తొలగించిన మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపాలిటీ లోని 22వ వార్డు రహమత్ నగర్ లో ఎటువంటి పర్మిషన్ లేకుండా జనసంచారం కలిగిన ఏరియాలో అక్రమంగా బీఫ్ షాపులు నిర్వహించడం జరుగుతుందని 22వ వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదులు అందజేయడంతో మంగళవారం నల్లగొండ పురపాలక సంఘం తో కలిసి అక్రమంగా నిర్వహిస్తున్న షాపులను జెసిబిల సహాయంతో నేలమట్టం చేశారు.మిగతా షాపులను సీజ్ చేసి అందులో అమ్ముతున్న మాంసాన్ని స్వాధీన పరుచుకొని డంపింగ్ యార్డులో ఖననం చేశారు..షాప్ నిర్వాహకులు మాట్లాడుతూ మాకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా తమపై కావాలనే ఇలాంటివి చర్యలు చేస్తున్నారని గతంలో కూడా పర్మిషన్ కొరకు ఎన్నో విధాలుగా మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నామని అయినా ఇన్స్పెక్టర్ తమ గోడును వినలేదని అన్యాయంగా తమ షాపులను కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

# నల్లగొండ మున్సిపాలిటీ ఘనత




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్‌:** పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎంసీఏపి) కింద నిర్వహించబడిన స్వచ్ఛ్ వాయు సర్వేక్షణ్2024 లో నల్లగొండ మున్సిపాలిటీ అత్యుత్తమ పనితీరు కనబరుస్తూ జనాభా కేటగిరీ3 ( 3 లక్షలు)లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచి ఘనత సాధించింది. ఎంసీఏపి డైరెక్టర్ డా. ప్రశాంత్ మార్గదర్శకాలకు అనుగుణంగా 202324 ఆర్థిక సంవత్సరానికి 131 నగరాలు స్వీఅంచనా నివేదికలు సమర్పించగా, వాటిని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిబిసిబి) మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో నల్లగొండ మున్సిపాలిటీ అత్యుత్తమ పనితీరు కనబరిచిన మున్సిపాలిటీలో ఒకటిగా ఎంపిక చేయడమే కాకుండా, స్వచ్ఛ్ వాయు సర్వేక్షణ్2024లో రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఈనెల 7వ తేదీన రాజస్థాన్‌లోని జైపూర్ ఎగ్జిబిషన్,కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న స్వచ్ఛ్ వాయు దివస్2024 సందర్భంగా నల్లగొండ మున్సిపాలిటీకి పర్యావరణ,అటవీ,వాతావరణ మార్పుల మంత్రి, రాజస్థాన్ ముఖ్యమంత్రి చేతులమీదుగా నగదు పురస్కారాన్ని అందుకొనున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/శాలిగౌరారం:** సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజు శాలిగౌరారంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి , వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ వస్తుందని రుణమాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కుటుంబా నిర్ధారణ కోసం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుండి వస్తున్న దరఖాస్తులను ఆయన పరిశీలించారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక్కో రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఎవరు అపోహాలకు గురి కావద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పావని, ఏఈఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువును నింపాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** ధర్మారెడ్డి పల్లి కాల్వ ఫీడర్ ఛానల్ ద్వారా రామన్నపేట పెద్ద చెరువు నింపాలని ముదిరాజ్ మత్స్యకారులు, రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కందుల హనుమంతు, కార్యదర్శి పిట్టల మచ్చగిరిలు మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి కాల్వలకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోయి రైతులు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఫీడర్ చానల్ ద్వారా పెద్ద చెరువు నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దబోయిన మీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రీయ మాసము నిర్వహిస్తామని అంగన్వాడి సూపర్వైజర్ ఎం యశోద అన్నారు. మండలములోని తిరుగండ్లపల్లి గ్రామములో మంగళవారం అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం జరిపినారు. చిన్నారుల పెరుగు దలను పర్యవేక్షించి తల్లులకు అనుబంధ ఆహారంపై అవగాహన ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,ఆరు నెలలు నిండిన తరువాత అనుబంధ ఆహారం పెట్టాలని తల్లులకు వివరించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, మూడు సంవత్సరములు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి. తారక రామన్, అంగన్వాడి టీచర్లు శ్రీదేవి,నిర్మల,ఆయా అబ్బమ్మ, తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పట్టణంలోని ఎన్ఎస్పీ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్ 11 బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టోర్ని ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ టోర్నమెట్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 200కు పైగా బాలబాలికలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మూడు రోజులపాటు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పోటీలకు చీఫ్ రెఫరరిగా ఎండి.సోహెల్, మ్యాచ్ కంట్రోలర్‌గా చంద్రశేఖర్‌తోపాటు రాష్ట్ర స్థాయిలో ఎంపైర్లుగా నియమించబడిన వారు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజయ్య,వనమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడా..



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కశారం గ్రామంలోని బస్టాండ్ రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతిని ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇట్టి విషయం అయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపిన నేటికి స్పందించకపోవడంతో రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసం అయి ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి నెలకొందని గ్రామస్థుల తరుపున వీరబోయిన లింగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బస్టాండ్ వద్ద పూర్తి స్థాయిలో సిసి రోడ్డును నిర్మించి ప్రజలకు, వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## శాంతియుత వాతావరణం లో గణేష్ నవరాత్రులు



ప్రజాపక్షం/మునుగోడు:శాంతియుత వాతావరణం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గణేష్ నవరాత్రులను నిర్వహించుకోవాలని మునుగోడు మండల గణేష్ నిర్వాహ కమిటీ సభ్యులకు చండూరు సిఐ వెంకటయ్య సూచించారు.మంగళవారం మునుగోడు మండల పోలీస్ స్టేషన్లో మునుగోడు మండల వ్యాప్తంగా నెలకొల్పుతున్న గణేష్ మండప నిర్వాకుల కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లతో కలిసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ప్రతి గణేష్ మండపానికి పోలీస్ శాఖ తరపున తప్పకుండా ఆన్లైన్లో పర్మిషన్ పొందాలని అన్నారు.మండపాల వద్ద జూదం మద్యపానం చట్ట విరుద్ధమైన పనులు చేయకూడదని పబ్లిక్ రోడ్డు కాలిబాట ప్రాంతాలలో మండపాలు ఏర్పాటు చేయొద్దని తెలిపారు.రాత్రి 10 దాటిన తర్వాత ఎలాంటి మైక్ సెట్ లు వాడొద్దని చదువుకునే విద్యార్థులకు ఆటంకం కలవకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.నిమజ్జనం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు.

## కెరీర్ గైడెన్స్‌పై ఉపాధ్యాయుల అవగాహన

ప్రజాపక్షం/మిర్యాలగూడ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఉపాధ్యాయుల అవగాహన కల్పించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం ఆయన తుంగపాడు ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సైన్స్ విద్యార్థులు పాఠ్యాంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి గ్రాడ్యుయేషన్‌లో తీసుకునే కోర్సులపై ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు తరువుగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. అనంతరం మాడ్గులపల్లి కేజీబీవీ విద్యాలయాన్ని మార్చడానికి శ్రీనివాస్‌నగర్‌లోని ప్రైవేట్ భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ దీనసుజాత, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో శ్రయమ్సొకెమికల్ కంపెనీలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యానికి గురై మరణించిన ఫిలిప్స్ కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ గోలి నరేందర్ రెడ్డి మంగళవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కట్ట వినోద్, గొల్లకొండ భాస్కర్, ఉగ్గు నాగరాజు, మనికంట, విజయకుమార్, పల్లెపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టుకు జల హారతి



ప్రజాపక్షం/డిండి: డిండి ప్రాజెక్టు అలుగు పోస్తున్న సందర్భంగా మంగళవారం ప్రాజెక్టుకు జల హారతి కార్యక్రమంలో సహచర అచ్చంపేట ఎంఎల్‌ఏ వంశీకృష్ణతో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్. ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులు





ప్రజాపక్షం/నందికొండః వర్షాకాలంలో ప్రభలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అందుకు డాక్టర్లు అనునిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని ఒక పక్క నిత్యం రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా కాన్ఫరెన్స్ లు,సెమినార్లు నిర్వహించి ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకూడదని చెబుతుంటే, మరో పక్క మాకెందుకులే,మాకేం పట్టింది అన్న చందంగా ఇక్కడ డాక్టర్ల వ్యవహారం ఉంది. ఇది ఎక్కడో కాదు నందికొండ మున్సిపాలిటీ పరిధి, హిల్ కాలనీలో ఉన్న స్థానిక ప్రభుత్వ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి దుస్థితి. కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో నిర్మించిన ఈ ఆసుపత్రి లో రోగులకు చికిత్స అందటానికి డాక్టర్లు ఎవరు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ఇంత పెద్ద ఆసుపత్రిలో అరకొర డాక్టర్లు ఉన్న వారు సమయాపాలన పాటించరని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ.పి సమయం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటే డాక్టర్లు తీరికగా ఉదయం 10 గంటలకు వచ్చి 12 గంటలకు వెళ్ళిపోతున్నారని ఇక "సందట్లో సడే మియాలాగా" ఆసుపత్రి సిబ్బంది కూడా రూములకు తాళాలు వేసుకుని పత్తా లేకుండా పోతున్నారని ఇంజక్షన్ రూముల దగ్గర పడిగాపులు కాసినా కానీ నర్సులు తీవ్రంగా దూషించి వెళ్ళిపొమ్మంటున్నారని రోగులు తమ గోడును వెళ్ళబోసుకుంటున్నారు.ఈవిషయమై రోగులు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తే అతను విచారణ జరిపి సమయాపాలన పాటించని డాక్టర్లపై ఇంజక్షన్ ఇవ్వని నర్సులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ః విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకోని, వాటి సాధన కోసం అహర్నిశలు కష్టపడాలని నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని బొట్టుగూడా ప్రభుత్వ పాఠశాలలో మిషన్ పరివర్తన కార్యక్రమం లో భాగంగా వన్ టౌన్ పోలీసులు,పల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శివరాం రెడ్డి, ఆర్డీవో రవి,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై శంకర్ విద్యార్థుల తో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డిఎస్పి కే శివరాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది ఒక వ్యక్తి యొక్క పూర్తి జీవితాన్ని నిర్దేశిస్తుందని, ఈ వయసులో కష్టపడి చదువుకొని అనుకున్న మంచి లక్ష్యాలను సాధిస్తే వారికి, వారి తల్లిదండ్రులకి సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ లక్ష్యసాధన కోసం ఎన్ని అవరోధాలు ఎదురైనా కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. అలాగే తెలిసి తెలియని వయసులో చెడు వ్యసనాలకు అలవాటై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.ఈకార్యక్రమంలో పల్ రెడ్డి రాంరెడ్డి, నరసింహారెడ్డి, హెడ్మాస్టర్ శంకర్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:జిల్లా కేంద్రం శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ విజయాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు మరింగంటి వరదాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం స్వామివారికి ఆరాధన, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, నాగవెల్లి దళ సైత అష్టోత్తర శత నామావళి ఆరగింపు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ పూజారి రఘువరణ్ చార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దశరథ, సభ్యులు హనుమంతరావు, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: భారీ వర్షాలతో కూరగాయలు, మిరప పంటలు సాగు చేసిన రైతులు సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి టి నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఉద్యానవన అధికారుల సూచనలు, సలహాలను పంటలను సంరక్షించుకోవాలన్నారు. మడుల్లో నిలువు ఉన్న అదనపు నీటిని బయటకు పంపాలని లేదా ఇంకేలా చూసుకోవాలన్నారు. మొక్కలు జాగ్రత్తగా నిలబెట్టి మొదలు వద్ద మట్టిని ఎరువుగా వేయాలన్నారు. మొక్కలకు సరిపోయేంత వరకు ఆకులు, కొమ్మలు ఉన్నట్లైతే 0.5 శాతం మల్టీకే(13.0.45) లేదా 2శాతం యూరియా ద్రవణాన్ని రెండు మూడు సార్లు మొక్కలు తడిసేలా వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలన్నారు. ఆకులమీద ఆకుమచ్చ లేదా కాయల మీద కాయ కుళ్లు, బూజు తెగులు ఉధృతి అధికంగా ఉంటుందని దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 గ్రాముల సాఫ్ మందును రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. వేరు కుల్లు ఆశించిన కూరగాయల తోటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, లేదా కార్బన్డిజం 10 గ్రాముల చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల పాదల్లో పోయాలన్నారు. మిరప తోటలో వర్షం ఉధృతికి వాలిపోయిన మొక్కలను వెంటనే తెరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదారను కలిపి ద్రవణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడబడి తలలు వాలిస్తే లీటర్ నీటికి 5 గ్రాముల మేగ్నిషియలం సల్ఫేట్ కలిపి ద్రవణాన్ని పిచికారి చేయాలన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పజాపక్షం/నల్లగొండ టౌన్ః యువత మాదకద్రవ్యాలు గంజాయి కి అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి సూచించారు. మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల,వయోవృద్ధుల, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పానగల్ లో గల ప్రభుత్వ హైస్కూల్ లో మాదకద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు ను నిర్వహించారు.ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో యువత పెడతావా పడకుండా మాదకద్రవ్యాలు దుర్వినియోగం నిర్మూలనకై అన్ని ప్రభుత్వాల శాఖల సమన్వయంతో విద్యార్థుల యొక్క భవిష్యత్తుని వెలుగు నింపడం కోసం ప్రభుత్వం అనేక రకమైనటువంటి కార్యక్రమాలు తీసుకొస్తుంద న్నా రు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రమీల,నార్కోటిక్ బ్యూరో నరేందర్ గౌడ్, భీమనపల్లి శ్రీకాంత్,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి మాజీ అధ్యక్షులు గోపాల్‌కు ఘన నివాళులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ః డిసిసి మాజీ జిల్లా అధ్యక్షులు పెరిక గోపాల్ 23వ వర్ధంతి సందర్భంగా నల్గొండ పట్టణంలోని ప్రకాశం బజార్లో గల ఆయన విగ్రహానికి పలువురు పూలమాలసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మాజీ ఎం ఎల్ ఏ కంచల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నల్గొండ పట్టణానికి గుండెకాయగా ఉన్న ప్రకాశం బజార్ వాణిజ్య వ్యాపార సముదాయ నిర్మాణం కోసం గోపాల్ చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రెగట్టే మల్లికార్జున్ రెడ్డి ,తదితరులు పాల్గోన్నారు

## యుద్ధ ప్రాతిపదికన చెరువులను పునరుద్ధరించాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ః తుఫాన్ ప్రభావంతో గత మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చెరువులు,కుంటలు తెగిపోయి రైతులకు తీవ్ర పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం వెంటనే చెరువుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మాజీ జడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి కోరారు.మంగళవారం మండలంలోని గోపాలపురం,బూరుగడ్డ గ్రామాల్లోని నల్లచెరువు,మోదుగులకుంట చెరువులకు పడిన గండ్లను మాజీ ఎంపిటిసి చీకూరి రాజారావుతో కలసి పరిశీలించారు.కార్యక్రమంలో షేక్ హసన్‌మియా,శాసనాల సత్య నారాయణ తదితురులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో పంటలకు తీరని నష్టం



ప్రజాపక్షం/చింతలపాలెం: మండలంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పత్తి,మిరప,వరి పంటలు తీరని నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పంట నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీచేసి పంట నష్టాన్ని అంచనా వేయించి తమను ఆదుకోవాలని మండల రైతులు వేడుకుంటున్నారు.